

# మా మంచి నాన్న!

-సుగంధ శ్రీనివాస్

ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ





"డాక్టర్...! పేషంట్‌ని థియేటర్‌కి తీసుకెళ్తున్నారు..."

"వెంట ఎవరెవరున్నారు?" కణతల మీది చేయి తొలగిస్తూ అడిగా.

వింతగా చూసిందా నర్స్... "...తెలీదు సర్."

అవును. ఆమెకెలా తెల్సు.

'తనకి నాలాగా 'అతని'తో ఏ బంధముందని-' టేబుల్ మీదున్న మంచినీళ్ళ గ్లాసందుకున్నాను.

"నాన్నా!" ఈ పదంతో అవసరం నాకింతవరకు రాలేదు. ఎందుకంటే అది పలకడమంత అసహ్యకరం మరేది లేదనిపిస్తుంది ఈ లోకంలో.

"సాగర్! నాన్నతో మాట్లాడురా...!" అమ్మ అర్థింపు.

"... నీకేవిధంగా పిలవాలనిపిస్తే అలాగే పిలువు- చివరికి తన పేరుతోనైనా...!" తల నిమురుతూ ఎన్నిసార్లు బుజ్జగించేదో!

"... సాగర్ నువ్వు డాక్టర్‌వి కావాలి!" పదో తరగతిలో అడుగిడిన మొదటిరోజు- నాన్న.

"నేనేదైతే నీకెందుకు?" పొగరుగా నా సమాధానం.

ఒక్క క్షణం అవాక్కైయ్యాడు. అదాయనకు అలవాటే!

"అది కాదు. నీ భవిష్యత్ కోసమే..."

"అసలు నువ్వెవరు?" చురకత్తి లాంటి మాట ఎక్కడ తగలాలో అక్కడ తగిలింది.

చెంప మీద ఐదు వేళ్ళ అచ్చు. 'చెళ్'మని అమ్మ చేతి దెబ్బ.

"ఏమనుకుంటున్నావ్‌రా?? అంతేసి మాట్లాడేంత మగాడివయ్యావా- చక్కగా చదువుకోమని చెబుతూంటే నీ పద్ధతేంటిరా?!" అమ్మ ముఖమ్మీద కోపం- దానికి మించిందేదో మరోటి.

"... ఇంట్లో వాళ్ళందరూ నీకు శత్రువుల్లాగే కనబడుతున్నారు. అలాంటపుడు మా దగ్గర ఉండటమెందుకు పోరా... పో! ఎక్కడికైనా వెళ్ళి బ్రతుకు."

అతడు అమ్మను వారిస్తున్నాడు.

నేను గడ్డకట్టిన కన్నీళ్లను కరిగించలేకపోయాను!

నేను మౌనంగా ఆ రోజంతా గడిపా. 'పోయే రోజొస్తే మీరంతా బ్రతిమిలాడినా ఈ ఇంట్లో ఉండను' అనుకున్నాను. మరుసటి రోజు నాకు కొత్త డ్రెస్ వచ్చింది.

'నేనెన్ని మాటలన్నా ఇతడు ఇలా పిచ్చి పనులు చేస్తూనే ఉంటాడు'.

గర్వంగా ఆ డ్రెస్ వేసుకున్నాను. జేబులో ఏదో కాగితం- బిల్లనుకున్నాను. విప్పి చూశా.

"... నాన్నా!

నువ్వెలాగూ నన్నిలా పిలవవు. నా మీద ద్వేషం ఉన్నందుకు నేను బాధ పడటం లేదు. అలా ఎపుడూ నా గురించే ఆలోచించి నీ చదువెక్కడ నిర్లక్ష్యం చేస్తావనే నా భయం. నువ్వు గొప్ప చదువులు చదవాలి. మంచి డాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలి. నీలో ఇపుడే అన్నీ డాక్టర్ లక్షణాలే ఇదేదో నా భావాలు నీ మీద రుద్దడం కాదు. ఒక తండ్రి కాని తండ్రిగా నీ జీవితాన్ని తీర్చిదిద్దాలనుకుంటున్నా. నాకో అదృష్టంగా దీన్ని భావిస్తున్నా. ఆ తర్వాత నీ జీవితాన్ని శాసించను. నీ నుండి మరేమీ ఆశించను. ముసలితనాన నిన్ను అర్థించను. మీ అమ్మ గర్వించే స్థానంలో ఉండాలనే నా తపన. అర్థమే చేసుకుంటావో, అపార్థంలోనే ఉండిపోతావో నీ ఇష్టం... నాన్న."

వెర్రి నవ్వొకటి నవ్వి ముక్కలుగా చించేశా.

"... డాక్టర్!"

నిద్రలో ఉన్నవాడు ఉలిక్కిపడినట్లు చూశాను.

"... డయాలసిస్‌కి టైమయింది." ఇంకా అక్కడే నిలబడి ఒక రకంగా చూస్తోంది నర్స్.

"పేషంట్ తాలూకు మనుషులెవరు నాకు కనబడొద్దు" అంటూ సీట్లోంచి లేచాను.

★★★

గాజు తలుపును నెట్టుకుని లోనికడుగు పెట్టాను.

సెలైన్ ఎక్కుతోన్న కుడి చేతి మణికట్టు ఉబ్బి ఉంది. ఇద్దరు నర్సులు, ఒక డాక్టర్ పేషంట్‌ని పరీక్షగా చూస్తున్నారు.

"మిస్టర్ ప్రకాశ్ ఇఫ్ యూ డోంట్ మైండ్... రెండు నిమిషాలు బయటికెళ్తారా...?!"

హఠాత్తుగా వచ్చిన ఆ మాటలకి వారంతా విస్మయానికి లోనవుతారని నాకు తెల్సు. నా వింత ప్రవర్తన అంతుపట్టనట్టు కనబడని భావాల్తో బయటికి నడిచారు.

నేను కూడా 'అతన్ని' పరీక్షగా చూస్తున్నాను. నా కళ్ళలో ఎగజిమ్మిన కన్నీళ్ళు- కంటి రెప్పల్ని దాటుతున్నాయి.

'నాన్నా! ఈ పిలుపుకోసమే కదూ- నీ ఆరాటం. ఏ కొడుకు అనని, అనలేని మాటల్తో నిన్ను చిత్రవధ చేస్తున్నా- నీకస్సలు కోపమే రానట్టు ఎంత ఓర్పుతో భరించావో! నువ్వు చేసిన తప్పేం లేకున్నా, నా లేలేత హృదయంపై మచ్చకి నువ్వే కారణమంటూ బాధించే నా సెగ పొగల ప్రవర్తనను ఎలా ఓర్చుకున్నావ్! నీ కన్న కొడుకును కాకున్నా నన్నెంత గారాబం చేశావ్? నాన్నా! నిజంగా చెబుతున్నా- మరు జన్మ అనేదే ఉంటే నీ ద్వారానే ఈ ప్రపంచానికి రావాలని కోరుకుంటున్నా...

నాన్నా...! నీకు ఏ మందులకు లొంగని వ్యాధొచ్చింది. నీ మూత్రపిండాలు విష పూరితమయ్యాయి. నీ రక్తంలో మలినాలు పేరుకుపోయాయి. నాన్నా... నిన్నెలా బ్రతికించుకోవాలో అర్థంకావడంలేదు.

నీ చేతి స్పర్శతో, మాటల తేనెతో నా ప్రవర్తన మార్చడానికి ఎన్ని ప్రయత్నాలు చేశావో- నాన్నా! నువ్వంటే నాకు చాలా ఇష్టం నాన్నా! కానీ 'నాన్న' అంటే ఇష్టం లేదు నాన్నా!

నాన్నా! నువ్వు బ్రతికితే ఎంత బావుంటుంది నాన్నా!

రెండు నిమిషాలు గడిచేసరికి తలుపు దగ్గర అలికిడైంది.

ఏ పేషంటుకైనా అత్యవసర వైద్యం చేస్తున్నపుడు ప్రతి క్షణమూ అమూల్యమైనదే! అందుకే ఆ ముగ్గురి ఆతృత.

కన్నీళ్ళు వారి కంట పడనీయకుండా తుడుచుకుంటూ లోనికి రమ్మన్నట్లు సైగ చేశాను.

★★★

"... నాన్నా! మిమ్మల్నో మాటడగాలనుకుంటున్నా..." నా పుత్ర రత్నం- సమీర్.

"... మీలో మీరే తల్లడిల్లుతారు. బాధపడతారు- కారణమేంటి- అదీ ఈరోజు ఇంకా ఎక్కువగా కనబడుతోంది."

"మా నాన్నని చూశాను."

ఈ సమాధానం మా వాడిని ఒక్క నిమిషం మూగవాణ్ణి చేసింది.

నా గతం సమీర్‌కు కాస్త తెలుసు. టెన్త్ చదువుతున్నాడు.

"... మన హాస్పటల్‌లోనే ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు. కిడ్నీలు డామేజ్, పాయిజనస్సయ్యాయి. ఇక కొన్నాళ్ళే...!" నా గొంతు జీరబోయింది.

"... నాన్నా! మీ నాన్న చాలా మంచివాడు కదా! ఎందుకాయనతో సరిగా ఉండలేకపోయారు!? నావైపు ఆసక్తిగా చూస్తూ అడిగాడు.

"... కన్నా! నాన్న విశ్వరూపం ఏంటో తెలిశాక ఇంకెవరినీ నాన్నగా ఈ 'మనసు' ఒప్పుకోలేదు. బాల్యంలో పడిన ఆ బలమైన ముద్ర నాలో ఇంకా చెరిగిపోలేదు. నాన్న అంటేనే అలా ఉంటారని అనుకుంటూ ఉండేవాణ్ణి- నువ్వు పుట్టేవరకు- నేను నాన్నగా మారే వరకూ."

"... మీరెపుడైనా తప్పు చేశానని అనుకుంటున్నారా...?! మీ అమ్మా నాన్నలను బాధ పెట్టినందుకు?"

"నేను తండ్రిగా మారినప్పట్నుంచీ అనుకుంటూనే ఉన్నాగా-" ఆ సమయంలోనే వాళ్ళమ్మను పోగొట్టుకున్నాడు- సమీర్.

"... మరి సరిదిద్దుకునే మార్గం లేదా-"

"నన్ను మా నాన్న పెంచినట్లు నిన్ను పెంచడం తప్ప... ఇంకే మార్గమూ లేదు- ఆలస్యమైంది. నా హృదయంలో దాచుకున్న ఆ మాటలు మాత్రం ఇంకా పదిలంగా ఉన్నాయ్!"

"మీ నాన్న అంత బాగా చెప్పేవాడా..." ఆ మాటల్లో నమ్మలేని తనం. "మీ నాన్నకంటే బాగా... కానీ నేనే పట్టించుకునేవాణ్ణి కాదు."

"ఎందుకు?"

"నాన్నంటే ద్వేషం!"

వింతగా, చూశాడు. ఇక వాడిని తికమక పెట్టడమెందుకని చెప్పడం మొదలపెట్టా.

* * *

నాకపుడు ఆరేళ్ళుంటాయేమో-

నాన్న చేసే పని తెలీదు గానీ ఇంటికి చాలామంది వచ్చి పోతుండేవారు. గుండ్రంగా కూర్చుని ఆ ఆట ఆడేవారు. మధ్యమధ్యలో త్రాగుతూ డబ్బులు కుప్పగా పడేస్తూ ఆ ఆట ఆడేవారు.

అమ్మతో ప్రతిరోజూ నాన్న గొడవ పడేవాడు. నాకేం అర్థంకాకపోయేది- అమ్మను నాన్న చాలాసార్లు కొడుతుండగా నే చూశా. అమ్మ వెక్కివెక్కి ఏడ్చేది. ఆ వెంటనే నాన్న అమ్మను నా ముందరే బట్టలిప్పమనేవాడు. అమ్మ వెనుగులాడుతూ పడిపోయేది. నేను భయంతో కళ్ళు మూసుకునేవాడిని.

ఆ రోజు పండగని అమ్మ నాకు తలంటు స్నానం చేయించింది. పాయసం కూడా చేసింది. పొద్దున్నుంచీ నాన్నసలు కనబడలేదు ఆరోజు.

అమ్మ కథ చెబుతూండగానే నిద్రపోయా.

ఏదో అలికిడికి కళ్లు తెరచి చూశా.

ఎదురుగా అమ్మ- నాన్న ఇంకిద్దరూ!

నాన్నను అమ్మే బ్రతిమిలాడుతోంది. అప్పటికే అమ్మకు చీర లేదు. నాన్నతో సహా ఆ ముగ్గురు తూలుతున్నారు. అమ్మను ఒక్క తన్ను తన్నాడు నాన్న. అంతే అమ్మ బంతిలా గోడకి చారగిలబడింది.

అపుడు అమ్మ కూడా "అమ్మా"అనే అరిచింది.

అమ్మ మీద ఆ ముగ్గురు వాలిపోయారు.

నేను భయంగా వారినీ వారి నీడలను చూస్తున్నాను.

అంతలోనే అమ్మ చేతికి కత్తిపీట దొరికింది. అంతే! ముగ్గురూ రక్తపు మడుగులో గిలగిలా కొట్టుకుంటున్నారు.

చేసిన పనికి అమ్మ క్షణకాలం బిత్తరపోయింది!

ఆ వెంటనే నన్ను భుజాన వేసుకుని పరుగుతీసింది.

తెల్లారేసరికల్లా రైల్లో ఉన్నాము.

అమ్మ కళ్ళచుట్టూ తడి- చెంపల మీద చారలు.

అమ్మను ఇంకా గట్టిగా పట్టుకుని కళ్లు మూసుకున్నా.

* * *

సమీర్ ఉత్కంఠగా చూస్తున్నాడు.

"నాన్నా...! మరి మీ రెండో నాన్న..." అర్ధోక్తితో ఆగిపోయాడు.

"మా అమ్మ మళ్లీ పెళ్లి చేసుకుంది. తనకి నచ్చిన వ్యక్తిని, తనని మెచ్చిన వ్యక్తిని... అపుడైతే అది పెళ్లని తెలీదు గానీ ఇపుడర్థమవుతోందిగా! అతడు నన్ను చూడగానే దగ్గరికి తీసుకోబోయాడు. నేను అమ్మ చీర కుచ్చిళ్ళలో దూరబోతుంటే- అమ్మ అంది - 'మీ నాన్న'అంటూ!"

"అపుడు మీరేమన్నారు??" మా అబ్బాయి నా వెనకాలే వస్తున్నాడు. చిర్నవ్వుతో వాడివైపు చూసి "... ఊహించగలవా?!" నా ఎదురు ప్రశ్న.

సమీర్ మౌనంతో సంభాషిస్తుండగానే నేను చెప్పేశా.

"అమ్మా! నాన్న మనకు వద్దే! మళ్ళీ నిన్ను కొడతాడు."

అతడు శిలలా బిగుసుకుపోయి అమ్మనే చూశాడు.

అలా మొదలైన మా ఎడబాటు తమ్ముడు పుట్టాక కూడా కొనసాగుతూనే ఉంది.

* * *

ఈ నాన్న రాత్రీపగలు తేడా లేకుండా పనిచేసేవాడు. అమ్మ పనికి వెళ్ళడం మానేసింది. రంగురంగుల బట్టలు ఇంట్లో ప్రత్యక్షమయ్యాయి. తనకి మాత్రం ఆ రంగు వెలసిన బట్టలే ఎపుడు ఒంటిమీద! నాన్నంటే హేళనాభావం నా వయసుతోబాటే పెరిగింది. నేనతన్ని ఏ విషయంలోనూ గౌరవించేవాడిని కాదు. అయినా అతడు ఏనాడూ కోపగించుకోలేదు.



"మా అమ్మ మళ్లీ పెళ్లి చేసుకుంది. తనకి నచ్చిన వ్యక్తిని, తనని మెచ్చిన వ్యక్తిని... అపుడైతే అది పెళ్లని తెలీదు గానీ ఇపుడర్థమవుతోందిగా! అతడు నన్ను చూడగానే దగ్గరికి తీసుకోబోయాడు. నేను అమ్మ చీర కుచ్చిళ్లలో దూరబోతుంటే- అమ్మ అంది - 'మీ నాన్న'అంటూ!"

నేనింట్లో ఏది కోరితే అది క్షణాల్లో రావలసిందే!

అమ్మ ఏదో సందర్భంలో నాన్నకు సర్దిచెబుతున్నపుడు-

"సంఘటనల సమాహారమే జీవితం- ప్రతీ రోజూ నవ్వుతూ పనిచేసిన క్షణాలే జీవితం. నిజాయితీగా ప్రేమిస్తూ 'నిజం'గా ఉండటమే జీవితం. గెలుపుకోసం శ్రమిస్తూ గెలిచాక ఓడడమే జీవితం. ప్రేరణనందిస్తూ శ్రమ చినుకులు చిందించడమే జీవితం. చిన్నారిగా ఆనందిస్తూ వైరాగిగా భావించడమే జీవితం..." అని నవ్వాడు.

అప్పుడతడు ఇష్టం లేకున్నా- అప్పట్నుంచీ ఆ మాటలు ఇంకా గుర్తున్నాయి.

నేను ఆయనతో అసలు మాట్లాడేవాణ్ణి కాదు- కానీ కల్పించుకుని తనే మాట్లాడేవాడు. ఒకసారి నా ఫ్రెండ్‌కి నాకూ గొడవైంది.

తప్పంతా నాదే! కానీ ఒప్పుకోను కదా!

అపుడన్నాడు "... జీవితంలో క్షమాపణ కోరే సందర్భం వచ్చినా, కృతజ్ఞతలు చెప్పే అవకాశం వచ్చినా, అభినందించే తరుణం వచ్చినా ఒక్క క్షణం కూడా వాయిదా వేయొద్దు. జీవిత గమనాన్ని నిర్దేశించే క్షణాలవి" అని.

నాన్న ఓ గొప్ప ఫిలాసఫర్. ఓ గొప్ప మానవతావాది.

అటువంటి నాన్నను నేనెన్నిసార్లు అవమానపరిచానో లెక్కేలేదు.

నేనపుడే యవ్వనంలో అడుగుపెడుతున్న రోజులు- ఓ రోజు అమ్మ తన గతమంతా అతని ముందర నాకు చెప్పింది.

"నాకెందుకు చెబుతున్నావ్?!" నా ప్రశ్నకు అతడు ఏ సమాధానమిచ్చాడంటే-

"నిజం నిప్పు లాంటిది. పట్టుకుంటే కాలుతుంది. పట్టించుకోకుంటే కాల్చుతుంది"అని.

అమ్మ చనిపోయేంతవరకు నేను పదో తరగతి పాస్ కాలేదు. చదువు రాక కాదు- అతని మీద ద్వేషంతో!

ఒకే ఇంట్లో ఇద్దరుండటం బాగుండదనుకుని నన్ను ఓ మంచి హాస్టల్లో చేర్పించాడు. అపుడు చదవడం అంటే తెల్సిపోయింది.

నాకు మెడిసిన్‌లో సీటొచ్చింది.

ఈలోపు తమ్ముని చదువూ నా చదువుకు ఖర్చు పెరగసాగింది.

నేనే వినోదాలు మిస్సవకుండా మెడిసిన్ పూర్తిచేశా.

ఓ రోజు రేఖను తీసుకుని ఇంటికెళ్ళా.

అర్థం చేసుకుని ఆలోచిస్తున్నాడు.

"ఈ లోకం పడితే నవ్వుతుంది. పరిగెత్తుతే చప్పట్లు చరుస్తుంది. అర్థం చేసుకుంటే ఇంతే! ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది. ఆ స్త్రీ ప్రేయసి అయితే విజయం యవ్వనంనుండి ప్రారంభమవుతుంది. తల్లి అయితే బాల్యంనుండి మొదలవుతుంది. ఆడదానికి అంత విలువుంది మరి... మా వాడికి నువ్వు గొప్ప ప్రేరణగా మారుతున్నందుకు కృతజ్ఞతలు!" అంటూ చేతులు జోడించాడు.

ఎంత గొడవ చేస్తాడో అని హడలి పోయాను. కానీ ఇలా మాట్లాడ్డం ఆశ్చర్యం కల్గించింది.

అపుడు వెళ్ళానంటే అదే చివరిది!

ఒకపుడు ఇంట్లోంచి వెళ్ళమన్న విషయం మరిచిపోలేదు.

* * *

సమీర్‌ను వెంట తీసుకుని హాస్పటల్‌లో అడుగు పెట్టానో లేదో- ఆ పేషంట్‌కి సీరియస్ అంటూ నర్స్ వచ్చి చెప్పింది.

బాబును తీసుకుని అక్కడికెళ్ళాను.

ఒక వ్యక్తి సూటులో ఉండి సపర్యలు చేస్తున్నాడు.

తమ్ముడే!

చకచకా వెళ్ళి పల్స్ చూశా. దొరకడం లేదు.

మరణానికి అతి చేరువలో నాన్న!

ఒక డాక్టర్‌నన్న సంగతి మరిచేపోయా.

ప్రాణాలు- అతి మామూలు విషయం మాకు.

జననాలు- మరణాలు లెక్కలోకి తీసుకోని వృత్తి మాది.

కానీ ఈ వ్యక్తి మరణం - మామూలు విషయం కాదు.

నాలో ఆశయంగా, ఆదర్శంగా నిలిచి నా జీవితానికి దారి చూపిన ఆ వ్యక్తి ఇపుడు చనిపోతున్నాడు.

సమీర్ ఇదంతా చూస్తూనే ఉన్నాడు.

తట్టడం సాకుతో శరీరాన్ని అంతటా స్పృశిస్తూ కాళ్ళనోసారి కళ్ళకద్దుకున్నాను.

మనిషి నిర్జీవంగా తయారయ్యాడు.

మా నాన్న చనిపోయాడు.

నేను ఇది నమ్మలేనట్టుగా చూస్తూంటే-

"అన్నయ్యా!"అంటూ పిలుపు. ఇంకా ఆశ్చర్యపోయా.

"... చనిపోయే ముందు నీ హాస్పటల్‌లోనే కన్నుమూయాలని, చివరి సారిగా నాన్నను నువ్వు చూసుకోవాలని నాన్న ముందుగానే చెబితే తీసుకొచ్చాను."

దిగ్భ్రాంతికి లోనయ్యా!

"... అవును. తనకు తల కొరివి కూడా నువ్వే పెట్టాలని తన చివరి కోరికగా చెప్పారు నాన్న."

నాకు చుక్కలు, ఆకాశం భూమి అన్నీ కల్సిపోయినట్లు తల దిమ్ముమంటోంది.

"... నాన్న చివరి కోరిక తీర్చవా అన్నయ్యా?!"

నేను 'నేను'గా లేని విధంగా మారానేమో-

"నాన్నా!" అంటూ చనిపోయిన నాన్న కాళ్ళను చుట్టేశా. ★